సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం : 18 : జూన్ : 2024

పైడితల్లమ్మ పండగకు సర్వం సిద్ధం



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగకు విస్తృత ఏర్పాట్లు చేశారు. 8లో



హైవేపై రైలింజన్

తగరపువలస: తాళ్లవలస జాతీయ రహదారిపై ఒక భారీ ట్రాలర్ నిలిచిపోయింది. కోల్‌కత్తా వైపు ఈ ట్రాలర్ రైలింజన్ తీసుకుని వెళ్తోంది.



అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్(విశాఖ) :కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

డోలీలో గర్భిణి తరలింపు



డోలీలో గర్భిణిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: సరైన రహదారి, రవాణా సౌకర్యం లేక అత్యవసర సమయంలో డోలీమోతలు తప్పడం లేదంటూ మారుమూల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగ గ్రామానికి చెందిన బడ్నాయిన కొత్తమ్మ(23) నిండుగర్భిణి. సోమవారం ఉదయం పురిటినొప్పులు అధికమయ్యాయి. భారీ వర్షాల కారణంగా రోడ్డంతా పూర్తిగా కోతకు గురైంది. గ్రామానికి అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు బూరుగ గ్రామం నుంచి ఎన్ఆర్ పురం పంచాయతీ రాయిపాడు వరకు 9 కిలోమీటర్లు ఆమెను డోలీ మోతపై తీసుకువచ్చారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో విజయనగరం జిల్లా ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి తమ గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు.

ఘనంగా లక్ష్మీదేవి కొలుపులు



అమ్మవారిని ఊరేగిస్తున్న గిరిజనులు

ఎటపాక: మండలంలోని గొమ్ముకోయగూడెంలో లక్ష్మీదేవితల్లి కొలుపులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ పూనకాలతో కొలుపు ప్రారంభించారు. ఉదయం అమ్మవారిని ఊరేగింపుతో గంగా స్నానానికి తీసుకు వెళ్లారు. అనంతరం గుడిలో ప్రతిష్ఠించడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తొలకరి ప్రారంభంలో ఈవేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమంలో పూజారి కవులూరి వీరభద్రం,పటేల్ రాజులు,ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూనం శ్రీను, బాలరాజు,కామేశ్వరరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'తండేల్'




నటీనటులు సాయి పల్లవి, నాగచైతన్య

కొమ్మాది(విశాఖ): గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చందు మొండేటి దర్శకత్వంలో తండేల్ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. సోమవారం విశాఖ నగరంలో మంగమారిపేట బీచ్, ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో చిత్ర హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవిపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మత్స్యకార బ్యాక్‌గ్రౌండ్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అందుకే మత్స్యకార గ్రామాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న రెండో చిత్రమిది. అదే విధంగా సాయి పల్లవి, నాగచైతన్య కలిసి నటిస్తున్న రెండో సినిమా కూడా ఇదే కావడం విశేషం. బన్ని వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే 75 శాతం సినిమాచిత్రీకరణ పూర్తయిందని చిత్ర యూనిట్ తెలిపింది. సినిమా షూటింగ్ చూ సేందుకు ఉప్పాడ, మంగమారిపేట, భీమిలి, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు ఇక్కడకు చేరుకున్నారు.

శభాష్ రైతన్న

సీతమ్మధార(విశాఖ) : తనకు దొరికిన బంగారు చైనును.. పోగొట్టున్న మహిళకు అందజేసి ఓ రైతు అందరి ప్రశంసలు అందుకున్నాడు. దొండపర్తి దరి టీఎస్ఎన్ కాలనీకి చెందిన పి.కనక దుర్గాదేవి ఆదివారం ఉదయం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చింది. ఆమె మెడలోని నల్ల పూసల బంగారం చైను తెగిపోయింది. ఏడు గ్రాముల బరువు గల చైను పోయిందని ఆమె రైతుబజార్ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. సిబ్బంది మైకులో సదరు సమాచారం ప్రకటించారు. దీంతో కొత్తపాలేనికి చెందిన రైతు అప్పారావు తనకు దొరికిన చైనును సిబ్బందికి అందజేశారు. అనంతరం రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు బాధితురాలికి చైను అందజేశారు. ఆయన వెంట రైతుబజార్ అటెండర్ సతీష్, రైతులు ఇతర సిబ్బంది ఉన్నారు. తనకు చైను అందజేసిన రైతుకు, బజారు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కూరల ధరలు పైపైకి..



పాడేరులో కూరగాయల దుకాణం

- 10 రోజుల్లో భారీగా పెరుగుదల
- దిగుబడి తగ్గడమే కారణం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొంతమంది వ్యాపారులు
- ఏం తిని బతకాలని సామాన్యుడు గగ్గోలు

సాక్షి,పాడేరు: కూరగాయల ధరలు భగ్గుమనడంతో సామాన్యులపై భారం పడుతోంది. 10 రోజుల్లో ధరలు బాగా పెరిగాయని, ఇలా అయితే ఏం తినాలని సామాన్యప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు, వారపుసంతలలోను అధిక ధరలతోనే వ్యాపారులు కూరగాయలను అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయల దిగుబడి తగినంతగా లేకపోవడంతో మైదాన ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తోంది. దీంతో రవాణా చార్జీలన్నీ కలుపుకొంటే ధరలు తడిసిమోపెడు అవుతున్నాయి. ఇదే సాకుగా చూపి కొంతమంది కృత్రిమ కొరత సృష్టిస్తూ మరింతగా ధరలు పెంచి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

దిగుబడి తగ్గడంతో...

ఎండల కారణంగా కూరగాయల దిగుబడి తగ్గడంతో మైదాన ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అనకాపల్లి మార్కెట్‌కు ఆ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తారు. ఇక్కడ నుంచే పాడేరు తదితర ప్రాంతాల వ్యాపారులు కూరగాయలను కొనుగోలు చేసి గ్రామాల్లో అమ్మకాలు జరుపుతున్నారు.

ట'మోత'... కిలో రూ.80

రెండు వారాల కిందట కిలో టమాటా ధర రూ.30 ఉండగా, వారం రోజుల కిందట రూ.60 చొప్పున విక్రయించారు. ఇప్పుడు ఏకంగా రూ.80కి పెరిగింది. దొండకాయలు రూ.70, బెండకాయలు రూ.80, తెల్ల వంకాయలు రూ.80, నల్ల వంకాయలు రూ.60. బీరకాయలు రూ.80, బీన్స్ రూ.80, క్యారెట్ రూ.65, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం రూ.120, క్యాబేజీ రూ.40, బంగాళదుంపలు రూ.45, ఉల్లిపాయలు రూ.50, అల్లం కిలో రూ.200 ధరతో అమ్మకాలు జరుపుతున్నారు. పది రోజుల్లో కూరగాయల ధరలు కిలోకు ఏకంగా రూ. 20 నుంచి రూ.30 వరకు పెరిగాయి. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెలు, బియ్యం ధరలు ఆకాశాన్నంటగా ఇప్పుడు కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగాయని సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవలసి వస్తోంది. అధికారులు స్పందించి పెరుగుతున్న కూరలు, నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలని సామాన్యులు కోరుతున్నారు.

వాల్తేరు దూకుడు

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో అత్యధిక ఆదాయార్జన
- 2023-24లో రూ.546 కోట్ల ఆదాయంతో టాప్-1గా నిలిచిన విశాఖ
- రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంలో జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్
- విశాఖ స్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికుల రాకపోకలు



విశాఖ సిటీ: వాల్తేరు డివిజన్ పరుగులు పెడుతోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ.. ఆదాయంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోతోంది. తూర్పు కోస్తా రైల్వే జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్‌ను సైతం వెనక్కునెట్టి ఆదాయార్జనలో విశాఖ స్టేషన్ ముందుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.546.14 కోట్లు ఆర్జించింది. జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ స్టేషన్ రూ.493 కోట్లతో ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అలాగే ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చడంలోను ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి 2,77,11,147 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

ఈస్ట్‌కోస్ట్ ఆదాయంలో సింహభాగం వాల్తేరుదే..

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతులా మారింది. అతి పెద్దదైన ఈ డివిజన్ పరిధిలో ఏటా 2.5 కోట్లకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. ఇందులో రూ.5 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు ఒక్క వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. అతి పెద్ద లోకో షెడ్, భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. డివిజన్ ఆదాయంలో సింహభాగం ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో పాటు వాణిజ్య ఆదాయం పెంపుపై దృష్టి పెట్టడంతో ఆ దిశగా కూడా వాల్తేరుకు భారీగా ఆదాయం సమకూరుతోంది.

రాకపోకల్లోనూ పరుగులు

2023, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024, మార్చి 31వ తేదీ వరకు విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఆర్ఎస్) ద్వారా 478.28 కోట్లు రాగా.. అన్‌రిజర్వ్ డ్ టికెటింగ్ సిస్టమ్(యూటీఎస్) ద్వారా రూ.67.86 కోట్లు వచ్చింది. మొత్తంగా విశాఖ రైల్వేస్టేషన్ నుంచి రూ.546.14 కోట్లు ఆదాయం లభించింది. అలాగే భువనేశ్వర్ స్టేషన్‌కు రూ.493.01 కోట్లు, ఆ తరువాత స్థానాలలో పూరీ స్టేషన్‌కు రూ.276.55 కోట్లు, బ్రహ్మపూర్ రైల్వేస్టేషన్‌కు రూ.101.94 కోట్లు ఆదాయం వచ్చింది. అదే విధంగా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి 2,77,11,147 మంది రాకపోకలు సాగించారు. భువనేశ్వర్ స్టేషన్ ద్వారా 2,63,46,444 మంది ప్రయాణాలు చేశారు. ఇలా ఆదాయార్జనలోనే కాకుండా ప్రయాణికుల రాకపోకల విషయంలో కూడా విశాఖ సత్తా చాటుతోంది.

అనారోగ్యంతో గొర్రెగేదె మృతి



గొర్రె గేదే కళేబరాన్ని ఖననం చేస్తున్న అధికారులు

మారేడుమిల్లి : స్థానిక కాఫీ తోటల వద్ద అనారోగ్యంతో సోమవారం ఓ గొర్రెగేదె మృతిచెందింది. ఆదివారం సాయంత్రం కదలలేని స్థితిలో ఉన్న దానిని గమనించిన కాఫీతోటలో పనిచేసే కార్మికులు అధికారులకు సమాచారం అందించారు. సోమవారం ఆ గొర్రెగేదె మృతి చెందిందని డివిజన్ అటవీశాఖ అధికారి జి.జి.నరేంద్రన్ తెలిపారు. పశు వైద్యాధికారి సీహెచ్ తరుణ్ కుమార్‌తో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కళేబరాన్ని ఖననం చేసినట్టు ఆయన తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని నరేంద్రన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ డివిజన్ అధికారి కె.శ్రీవాణి, రేంజ్ అధికారి ఎం.కరుణాకర్, వైల్డ్‌లైఫ్ అధికారి అరుణ్, సెక్షన్ అధికారి కిషోర్ బాబు, బీట్ అధికారులు అబ్రహాం, విక్టర్ బాబు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

- వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



కోచ్‌ల వద్ద ఆర్పీఎఫ్, కమర్షియల్ సిబ్బంది తనిఖీలు

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్ పరిధిలో భద్రతా ప్రమాణాలను పెంచుతూ రైళ్ల సమయపాలన విషయంలో కచ్చితత్వం పాటించడమే తమ ప్రధాన లక్ష్యమని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో రైల్వే బోర్డు నిర్వహించిన సమీక్ష ద్వారా భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలతో దేశవ్యాప్తంగా భద్రతా, సమయపాలన విషయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రైళ్ల రాకపోకలు, సమయపాలన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికుల సదుపాయలను సమీక్షించనున్నారు. రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్), కమర్షియల్ సిబ్బంది సంయుక్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహించి మహిళా ప్రయాణికుల కోచ్‌లు, దివ్యాంగ కోచ్‌లలో సాధారణ ప్రయాణికులను అనుమతించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు సైతం తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో బృందం ప్రయాణికుల సౌకర్యాలు, వెయిటింగ్ హాల్స్, కేటరింగ్ యూనిట్స్, పార్సిల్ కార్యాలయాలు, బుకింగ్ రిజర్వేషన్ కౌంటర్స్, రైళ్ల సమయపాలన వంటి విషయాలను పరిశీలిస్తోందని చెప్పారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

- పోక్సో కేసు నమోదు



నిందితుడితో పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఐ నవీన్‌కుమార్,ఎస్ఐ లక్ష్మణ్

సాక్షి,పాడేరు: పట్టణంలో ఈనెల 10వతేదీ అర్ధరాత్రి ఆరేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్టు స్థానిక ఏఎస్పీ ధీరజ్ సోమవారం తెలిపారు. సీబీఎం చర్చి సమీపంలోని ఓ ఇంటి వద్ద నిద్రపోతున్న బాలికను నిందితుడు సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ భవనంలోకి తీసుకువెళ్లి లైంగికదాడి చేశాడు. సీసీ కెమెరాల పుటేజీ, ఫోన్ కాల్స్‌ను పరిశీలించి నిందితుడిని 12వ మైలు రాయి జంక్షన్ వద్ద అరెస్ట్ చేసినట్టు ఏఎస్పీ చెప్పారు.ఈ కేసులో నిందితుడి స్నేహితుడిని ముందుగా అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిపారు. ఈకేసును ఛేదించిన పాడేరు సీఐ నవీన్‌కుమార్,ఎస్ఐ లక్ష్మణ్, ఇతర పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఏఎస్పీ అభినందించారు. బాలికలు,మహిళలపై ఎలాంటి దౌర్జన్యాలకు పాల్పడినా కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.



పాడేరులో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



రాజవొమ్మంగి మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు

సాక్షి,పాడేరు: బక్రీద్ పర్వదినాన్ని జిల్లాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన మసీదుతో పాటు జమాత్ మసీదు, గుత్తులపుట్టు, హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడ, జి.మాడుగుల, చింతపల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి తదితర మండలాల్లోని పలు మసీదుల్లో ముస్లింలు నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు బక్రీద్ సారాంశాన్ని వివరించారు. బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. సర్వమానవ సమానత్వం, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు మత్స్య మాడుగులమ్మ పండగ



ఘటాలు కొలువుదీరటానికి ఏర్పాటు చేసిన సతకంపట్టు



మత్స్యమాడుగులమ్మ తల్లి

జి.మాడుగుల: స్థానిక గంతకొండపై కొలువై ఉన్న మత్స్యమాడుగులమ్మ అమ్మవారి ఒక్క రోజు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించ తలపెట్టిన అమ్మవారి జాతర ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. పండగ సందర్భంగా దివంగత మత్స్యరాస మత్స్యరాజు స్వగృహం నుంచి ఘటాలు,పూర్వీకులు వినియోగించిన నాటు తుపాకీ,ఖడ్గాన్ని డప్పు వాయిద్యాలతో మంగళవారం ఉదయం తీసుకువచ్చి రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సతకం పట్టు వద్ద ప్రతిష్ఠిస్తారు. సాయంత్రం ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించి అమ్మవారి సన్నిధికి చేర్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పండగకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు
- తరలి వచ్చిన భక్తులు



సహస్ర నామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలారు. అప్పన్న ఆర్జిత సేవల్లో పాల్గొని తరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంచేయజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు రవిశంకర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రవిశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం సినీ సంగీత దర్శకుడు రవిశంకర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో ప్రియమణి, శరత్‌కుమార్, కృష్ణంరాజు ప్రధాన పాత్రల్లో విడుదలైన చండీ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అయినట్టు తెలిపారు. బాలీవుడ్‌లో అమితాబచ్చన్ నటించిన సర్కార్-3, తెలుగులో నాగార్జున హీరోగా విడుదలైన ఆఫీసర్ సినిమాతో పాటు కోలీవుడ్‌లో డాక్టర్ శివరాజ్‌కుమార్‌తో కిల్లింగ్ వీరప్పన్ అనే సినిమాకు సంగీత డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. ప్రస్తుతం ప్యాన్ ఇండియా మూవీగా వస్తున్న రామజన్మభూమి, వరదరాజుగోవిందం అనే సినిమాకు సంగీతం సమకూర్చినట్టు తెలిపారు.

మన్యం కవికి ఘన సత్కారం


మన్యం కవి నూనె రమేష్‌ను సన్మానిస్తున్న వక్తలు

వీఆర్‌పురం: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో మన్యం కవి నూనె రమేష్ ఘన సత్కారం అందుకున్నారు. ఇక్కడ శ్రీశ్రీ కళావేదిక తిరుపతి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఉషారాణి నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన 135వ జాతీయ స్థాయి కవి సమ్మేళన కార్యక్రమంలో ఆయన చేసిన 'కవిత కాల క్షేపమా 'అనే కవితా గానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి 150 మందికి పైగా కవులు ఈ సమ్మేళనంలో కవితా గానం చేశారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు సిహెచ్. లలిత తదితరులు నూనె రమేష్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపిక ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్ష


పాడేరు డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

పాడేరు రూరల్(హుకుంపేట): పూర్వ విద్యార్థులంతా మంచి చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని ప్రిన్సిపాల్ డాక్టరు వనము చిట్టిబ్బాయి ఆకాంక్షించారు. సోమవారం పాడేరు డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుని కళాశాలకు తమ కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. పూర్వ విద్యార్థులందరూ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపు నిచ్చారు. అనంతరం పాడేరు డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పైడితల్లమ్మ పండగకు సర్వం సిద్ధం

- అట్టహాసంగా ఏర్పాట్లు
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం
- అమ్మవారి జోగి, ఘటాల ఊరేగింపు
- విశేషంగా గంటదీపాల ఉత్సవం


అమ్మవారి జోగిని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి పండగను పురస్కరించుకొని సింహాచల దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ప్రసాదం, మంచినీరు అందించడంతో పాటు ఎండవేడి తగలకుండా షామియానాలు, టెంట్లు వేశారు. ఆలయ పరిసరాలతో పాటు అమ్మవారి శతకంపట్టు నుంచి పాత గోశాల వరకు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి జరిగే అమ్మవారి అనుపు మహోత్సవంలో పులివేషాలు, కాంతారా డ్యాన్స్, కేరళ డ్రమ్స్ ప్రదర్శనలను దేవస్థానం ఏర్పాటు చేసింది. అలాగే గ్రామ సంప్రదాయం ప్రకారం గాంధీనగర్‌లో ఘటాలగుడిగా పేరుగాంచిన అమ్మవారి సతకం పట్టును అలంకరించారు. అమ్మవారి విగ్రహానికి రంగులు వేశారు. అనుపు మహోత్సవానికి పూజారి వంశీయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ లండ వెంకటరమణ ఆధ్వర్యంలో లండ కుటుంబీకులు ఘటాలను సిద్ధం చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

పైడితల్లి అమ్మవారి పండగను పురస్కరించుకుని మంగళవారం పలు పార్టీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, బోర మోహన్ ఆధ్వర్యంలో స్థానిక సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో భారీ ఎత్తున వేదిక ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, స్పెషల్ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- దేవస్థానం బస్టాండ్ ప్రాంగణంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్, డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు.
- 98వార్డు జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు ఆధ్వర్యంలో బజార్‌లోని ట్యాక్సీస్టాండ్ ప్రాంగణంలో డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, రేలారే రేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- సతివాడ శంకరరావు ఆధ్వర్యంలో సింహాచలంలోని పుష్కరిణి సత్రం వద్ద ఆర్కెస్ట్రా, సినీ గాయకులచే పాటల విభావరి ఏర్పాటు చేశారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పైడితల్లమ్మ మహోత్సవం పురస్కరించుకొని సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. గాంధీనగర్‌లోని అమ్మవారి సతకం పట్టు నుంచి ఘటాలను పూజారి వంశస్తులైన లండ కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఊరేగించారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగించి.. రాత్రి పాత అడవివరంలో లండ కుటుంబీకులు గంటదీపాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలేళ్ల సందర్భంగా స్థానిక పుష్కరిణి సత్రం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన స్వరకల్పన ఉత్సాహపరిచింది.అడవివరం ప్రాంతానికి చెందిన గాయకుడు లొడగల రమేష్ తదితరులు పలు పాటలతో ప్రజలను అలరించారు.




సిద్ధం చేసిన ఘటాలు

ప్రజల పక్షాన పోరాటాలు చేయాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి


భాగ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చింతపల్లి, జి.కె.వీధి నాయకులు

సాక్షి,పాడేరు: ప్రజలు ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వారి సమస్యలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పోరాటాలు చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. చింతపల్లి, జి.కె.వీధి ఎంపీపీలు అనూషాదేవి, కుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులంతా సోమవారం భాగ్యలక్ష్మిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనులకు ఎంతో మేలు చేసిందన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల పక్షాన మనం పోరాటం చేయాలన్నారు.

గుండెపోటుతో జీసీసీ డీఎం మృతి


జీసీసీ డీఎం మధు (ఫైల్)

చింతూరు: స్థానిక జీసీసీ డివిజనల్ మేనేజర్ చింతా మధు(52) గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. చింతూరు జీసీసీ డీఎంగా పనిచేస్తున్న ఆయన వరుస సెలవులు రావడంతో తన స్వగ్రామమైన విశాఖ జిల్లా కొమ్మాది వెళ్లారు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. ఏడాదిగా చింతూరు జీసీసీ డీఎంగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి పట్ల జీసీసీ సిబ్బంది తమ సంతాపాన్ని వెలిబుచ్చారు.

గిరిజనులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

పాడేరు రూరల్(హుకుంపేట): గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగావకాశాలు గిరిజనులకు కల్పించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన సోమవారం పాడేరులో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని తక్షణమే బదిలీ చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల పదవి విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రోడ్డు నిర్మిస్తే తప్పా?

- అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు


గిరిజనులతో కలిసి గెడ్డలను దాటుకుంటూ వెళ్తున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి: మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కలగడం అదృష్టమని, అలాంటిది అనుమతులు లేవంటూ అటవీ శాఖ అధికారులు అడ్డంకులు పెట్టడం సమంజసం కాదని జెడ్పీటీసీ గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ గంగరాజు గెడ్డలను దాటుకుంటూ గుమ్మ పంచాయతీ కక్రీగుడ, కడరేవ్, గొప్పులపాలెం, కొట్టెంగూడ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్రీగూడ, కడరేవ్ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వెంటనే ఇవ్వాలని, లేని పక్షంలోని జిల్లా కేంద్రంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ మోస్య, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- గిరిజన మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఈశ్వరీ, విజయ



ముంచంగిపుట్టు: పాడేరులోని మోదకొండమ్మ ఉత్సవాల్లో ఆరేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గిరిజన మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఈశ్వరీ, విజయ డిమాండ్ చేశారు. అతడిని వెంటనే అరెస్ట్ చేయడంపై పోలీస్ శాఖను ఈ సందర్భంగా అభినందించారు. లైంగికదాడికి గురైన బాలికకు ఉన్నత చదువులకు సహకారం అందించాలని, ఆమె తల్లిదండ్రులకు ఉపాధి కల్పించాలని అధికారులను కోరారు.

విద్యుత్ షాక్‌తో నేపాల్ యువకుడి మృతి

కె.కోటపాడు : కింతాడలో సి.ఐ.బి.ఎస్ కళాశాలలో బైబిల్ కోర్సు నేర్చుకుంటున్న నేపాల్‌కు చెందిన జీవన్ మగర్ (28) విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందాడు. సోమవారం ఉదయం స్నానం చేసేందుకు మోటారును ఆన్ చేశాడు. మోటారు నుంచి నీరు రాకపోవడంతో దాన్ని పట్టుకున్నారు. ఆ సమయంలో మోటారు వెంబడి విద్యుత్ ప్రసరణ జరుగుతుండడంతో వెంటనే షాక్‌కు గురయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్నేహితుడు ప్రదీప్ సాగర్ కళాశాల సిబ్బందికి సమాచారం ఇచ్చి కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నారు.

పాఠశాలలు తెరవకుంటే మీరే బాధ్యులు

- స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ హెచ్చరిక


ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్

కొయ్యూరు: ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో పాఠశాలలు తెరచుకోకుంటే సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు బాధ్యులవుతారని సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి(ఏటీడబ్ల్యూవో) క్రాంతికుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్తున్నారో లేదో తెలుసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ఉండి పాఠశాల మూతబడితే సహించేది లేదన్నారు. ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు విధిగా వంట పాత్రలను శుభ్రం చేయించాలన్నారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రం చేయించాలన్నారు. వైద్యులకు సమాచారం ఇచ్చి వచ్చిన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. తల్లిదండ్రులకు ఫోన్లు చేసి విద్యార్థులను పాఠశాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను నిర్వహించాలన్నారు.



జల'యోగ'ం



బీచ్‌రోడ్డు(విశాఖ): ధనురాసనం, శవాసనం, కూర్మాసనం.. ఇవన్నీ యోగాలోని ఆసనాలు. నిత్యం నేలపై చేసే ఈ ఆసనాలను నీటిలో వేశారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన యార్లగడ్డ గీత శ్రీకాంత్. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం ఆమె వివిధ ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని గీత శ్రీకాంత్ అన్నారు. యోగా గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు జల యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

ఏజెన్సీ టీచర్లను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని వినతి

కశింకోట: ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రతినిధులతో కలిసి సోమవారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లకు అనకాపల్లిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 జూన్‌లో జరిగిన బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లిన 400 మంది ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. జీవో నెంబర్ 3 రద్దు కావడం, జీవో నెంబర్ 117 అమలు కావడం వల్ల ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

ముదముతో కొలిచేము మోదకొండమ్మా..


మోదకొండమ్మ ఆలయం

మాడుగుల: మన్యం దేవత, ఈ ప్రాంత ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మ జాతర మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారి పండగను ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం పరిపాటి. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశాలుండటంతో జాతరను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించారు. గ్రామం, పట్టణ పరిధిలో వీధుల్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయం నుంచి సతకంపట్టు వరకు, చోడవరం రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు, మోదమాంబ కాలనీ దాసరి వీధి, జగ్గన్నచావిడి, పురవీధుల్లో భారీ విద్యుత్ దీపాలంకరణ, సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ విద్యుత్ కటౌట్లు పెట్టారు. జాతర సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా వేర్వేరు చోట్ల పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సతకంపట్టు వద్ద డ్యాన్స్ హంగామా, ఎన్టీఆర్ స్టేజ్ దుర్గాలమ్మ ఆలయం వద్ద జబర్దస్త్ కళాకారులు, జీఆర్ ఈవెంట్స్ సారథ్యంలో డ్యాన్స్–2024, దసరా స్టేజీ మీద వీరాభిమన్యు బుర్రకథ, భక్త చింతామణి పౌరాణిక నాటకం, శ్రీ కృష్ణ రాయబారం పద్య నాటకం, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించనున్నారు. గవరవీధి, నెయ్యిల వీధి, అంబేడ్కర్ కాలనీ సమీపంలో డ్యాన్స్ మస్తీ, జవ్వాది గెడ్డ దేవరాపల్లి శ్రీను ఇంటి వద్ద సినీ నృత్య ప్రదర్శన, రావిచెట్టు జంక్షన్ వద్ద డ్యాన్స్ ఉత్సవ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద సూపర్ డూపర్ డ్యాన్స్, సతకంపట్టు వద్ద ప్రాచీన కళ తోలుబొమ్మలాటలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు గరగల నృత్యం, బిందెల డ్యాన్స్ తదితర సంప్రదాయ కార్యక్రమాలు జరగనున్నాయి. దాతల సహకారంతో ప్రసాద వితరణ, మజ్జిగ, గ్లూకోజ్ వాటర్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

'మాస్టారు' మాస్టారు.. మా మనసులు గెలిచారు

- సాహిత్య,కళారంగంలో రాణిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ బాబ్జీ
- కవి, రచయిత, నటుడుగా రాణింపు


అక్కినేని నాగేశ్వరరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న బాబ్జీ

మద్దిలపాలెం: వృత్తి రీత్యా అధ్యాపకుడు. తన అభిరుచికి అనుగుణంగా రచనలో రాణిస్తున్నారు. ఓ వైపు పిల్లలను పాఠాలు చెబుతూ..మరోవైపు రచయితగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అంతేకాకుండా కళలపై మక్కువతో నటనలోనూ ప్రవేశించి శభాష్ 'మాస్టార్' అనిపించుకుంటున్నారు మిసెస్ మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్. రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ. సాహిత్య, కళారంగంలో ఎంతో మంది మనసులను గెలుచుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి బాబ్జీ ప్రస్థానమిది.

ఆమె.. ఓ కథ చిత్రానికి దర్శకత్వం

బాల్య వివాహం.. భర్త అకాల మరణంతో కుంగిపోయి వీధి పోరాటంలో విజయం సాధించి ఎన్నో పురస్కారాలు బహుమతుల గెలుకుని స్త్రీ అబల కాదు సబలేనని నిరూపించిన చిత్రం ఆమె ఓ కథ. ఈ చిత్రానికి బాబ్జీ దర్శకత్వం వహించి సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఇదే స్ఫూర్తితో పలు లఘు చిత్రాల్లో నటించి మెప్పించారు.

రచయితగా రాణిస్తూ..

వివిధ సాహిత్య ప్రక్రియలతో రచనలు చేశారు. అవి వివిధ మాస పత్రికలో ప్రచురితమయ్యాయి. సమకాలిన సమాజంలో మార్పులపై తనదైన శైలిలో కవితలను రాశారు.

అవార్డులు..రివార్డులు

మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. అనంతరం ఆయన రచయితగా రాణిస్తున్నారు. వివిధ సంస్థల నుంచి సన్మానాలు పొందారు. 2017లో లెజెండ్ ఆఫ్ ఇండియా ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు, వీవీఐ ట్రస్ట్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీసెస్ ఎక్సలెన్స్ లెజెండ్ అవార్డును 2022లో అందుకున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు 2022లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ వారిచే పొందారు. ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీసెస్ వారి డాక్టర్ అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డును 2023లు తీసుకున్నారు. వీటితో వివిధ రంగాలకు చెందిన 16 అవార్డులు అందుకున్నారు.

కళలు, సాహిత్యం నా శ్వాస



సాహిత్యం, కళారంగం నా శ్వాస..అందులో రాణిస్తూ..పలువుర్ని ప్రోత్సహిస్తున్నాను. సాహిత్యం ఓ పెద్ద సముద్రం..ఎంత చదివినా..ఎంత రాసినా తరగనిది. ఓపిక ఉన్నంతవరకు కళారంగాన్ని..సాహిత్య రంగాన్ని విడిచిపెట్టాను. సాహిత్య సంపత భవిష్యత్ తరానికి అందించడమే నా ధ్యేయం.

–డాక్టర్.రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ